
సాక్షి సంగారెడ్డి

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



ఇంటిగ్రేటెడ్ కార్యాలయం ఏది?

ఐదు దశాబ్దాలుగా రాయపోలు మండల ఏర్పాటు కోసం పోరాడితే 2016 అక్టోబర్ 12న కల సాకారమైంది. వివరాలు 8లో ▸



వసంత పంచమికి వర్గల్ సిద్ధం

సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రం వసంత పంచమి మహోత్సవానికి ముస్తాబైంది. వివరాలు 8లో ▸



మురుగు కూపం..

భూగర్భజలాలు పెంపొందించాలనే ఉద్దేశంతో నిర్మించిన చెక్‌డ్యాం మురుగు కూపంగా మారింది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కొత్త మున్సిపల్ కమిషనర్ల రాక

సంగారెడ్డి /రామచంద్రాపురం(పటాన్‌చెరు) : గ్రేడ్ వన్ మున్సిపాలిటీ సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత మంగళవారం బదిలీ అయ్యారు. బదిలీల్లో భాగంగా అర్బుర్ కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ చౌహాన్ సంగారెడ్డి జిల్లాకు రానున్నారు. అలాగే తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా బొల్లారం మున్సిపల్ కమిషనర్ పనిచేస్తున్న సంగారెడ్డి బదిలీపై రానున్నారు. ప్రస్తుతం ఉన్న కమిషనర్ సమ్మయ్యకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. సంగారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

16న జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్ : జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు అధికారి వందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ చక్ర పాలీప్లాస్ట్ కంపెనీలో 20 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఐటీఐ పాసైనవారు పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించే జాబ్ మేళాకు పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 08455 - 271010లో సంప్రదించాలని సూచించారు.

నూతన డీఎస్పీగా సత్తయ్యగౌడ్

సంగారెడ్డి : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీలను బదిలీ చేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కు మార్ సిటీ సెక్యూరిటీ విభాగానికి బదిలీ అయ్యారు. రీజినల్ సీఐడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏ.సత్తయ్యగౌడ్ సంగారెడ్డి నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

పటాన్‌చెరు: ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్ తెలిపారు మంగళవారం పట్టణంలోని ఎల్లంకి కళాశాలలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ తరగతులు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ రావు, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీకి నీలం రాజీనామా

రేపు కాంగ్రెస్‌లో చేరిక

పటాన్‌చెరు టౌన్: ప్రజా పాలనలో భాగస్వామి కావాలని, కార్యకర్తల అభీష్టం మేరకు బీఎస్పీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు నీలం మధు ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న గాంధీభవన్‌లో పార్టీ వ్యవహారాల ఇన్చార్జి దీప్‌దాస్ మున్షి సమక్షంలో హస్తం కండువా కప్పుకోనున్నట్లు వెల్లడించారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం



మాట్లాడుతున్న సునీతారావు

సంగారెడ్డి : మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పార్టీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మహిళా కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల కోసం రేవంత్ సర్కార్ ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. గ్రూపు రాజకీయాల వల్లే సంగారెడ్డి, పటాన్‌చెరు స్థానాలు కోల్పోయామని గుర్తు చేశారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, సుధ పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం..

కొమురవెల్లి(సిద్దిపేట): నాల్గోవారం మల్లికార్జున స్వామి ఆలయానికి రూ.56,12,921 వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. పట్నం వారంలో శనివారం రూ.4,32,331, ఆదివారం రూ.44,99,038, సోమవారం రూ.6,81,552 ఆదాయం వచ్చిందన్నారు. భక్తులు స్వామివారికి మొక్కులు, దర్శనాలు, లడ్డూ ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఆదాయం సమకూరినట్లు బుకింగ్ ఇన్‌చార్జి మాధవి తెలిపారు.

చిరుత సంచారం

చేగుంట(తూప్రాన్): మండలంలోని రుక్మాపూర్ గ్రామ శివారులోని కాలువ సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం రాత్రి కాలువ సమీపంలోని పొలాల వద్ద చిరుతను గుర్తించి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసేందుకు ప్రయత్నించారు. నిర్మాణంలో ఉన్న కెనాల్ సమీపంలో రాత్రి సమయంలో చిరుత సంచరించినట్లు రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

అమరం.. అఖిలం ప్రేమ



ప్రేమ అంటే రెండు అక్షరాల మహా కావ్యం.. మాటలకందని మధురానుభూతి.. ఇద్దరి మనసుల సుదీర్ఘ ప్రయాణం.. ప్రేమ ఎప్పుడు పుడుతుందో, ఎలా పుడుతుందో ఎవరూ చెప్పలేరు. హెచ్చు తగ్గులు, కులమత భేదాలేవి చూసుకోరు. ప్రేమతో కలిగిన నమ్మకంతో పెళ్లితో ఒక్కటవుతారు. ఇలా ఎంతో మంది ప్రేమ వివాహాలు చేసుకుని సంతోషంగా జీవిస్తున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..

నేడు ప్రేమికుల దినోత్సవం



కలిపిన 'కలం స్నేహం'



సుధాకర్‌రావు, ఫర్హిన్‌షేక్

సాక్షిప్రతినిధి, సంగా రెడ్డి: వారిద్దరు ఉన్నత విద్యా వంతులు. పైగా సాహితీ ప్రియులు. వ్యాస రచనలు, వక్తృత్వం అంటే ఇద్దరికీ ఎంతో ఇష్టం. ఈ అభిరుచులే వారి హృదయాలను కలిపాయి. ప్రేమకు కుల, మతాలు అడ్డుకావని నిరూపించారు నల్గొండ పట్టణానికి చెందిన కె.సుధాకర్‌రావు, కర్నూలుకు చెందిన ఫర్హిన్‌షేక్.

సంగారెడ్డి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఫర్హిన్‌షేక్ నెల్లూరులో చదువుకున్నారు. ఆమె తరచూ వ్యాసరచన పోటీల్లో పాల్గొనేవారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చి సెయింట్ ఆన్స్ కళాశాలలో డిగ్రీలో చేరారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. పోటీల్లో కె.సుధాకర్‌రావు కూడా పాల్గొన్నారు. బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఆయన ఎంబీఏ చదివారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ మల్టీనేషనల్ కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. సుధాకర్‌రావు హైదరాబాద్‌లో చదువుకుంటున్న క్రమంలో ఓ మిత్రుడి ద్వారా ఫర్హిన్‌షేక్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య కొన్ని రోజులు కలం స్నేహం కొనసాగింది. అభిరుచులు కలవడంతో కులమతాలు వేరైనప్పటికీ వారిద్దరూ వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. వారి కుటుంబ సభ్యుల నుంచి కూడా పెద్దగా అభ్యంతరాలు రాలేదు. పెళ్లి చేసుకుని 25 సంవత్సరాలుగా వారు చాలా సంతోషంగా జీవిస్తున్నారు. కొన్ని నెలల క్రితమే ఈ దంపతులు సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసుకున్నారు. వారికి ఇద్దరు అమ్మాయిలు. పెద్ద అమ్మాయి సుఫా (సుధాకర్‌లో సు, ఫర్హిన్‌లో ఫ అక్షరాలు కలిసేలా పెట్టుకున్నారు) ఎంబీఏ చదువుతోంది. సుఫా అంటే పర్షియన్ భాషలో పవిత్రమని, గ్రీకులో శాంతి దేవత అని అర్థం అని ఫర్హిన్‌షేక్ తెలిపారు. చిన్నమ్మాయి ఇర ఎస్ఎస్సీ చదువుతోంది. ఎవరికైనా దాంపత్య జీవితంలో ఎప్పుడైనా చిన్న చిన్న మనస్పర్థలు వస్తే చర్చించుకుంటే ఇట్టే సమసిపోతాయని చెప్పుకొచ్చారు.

చదువుకునే రోజుల్లోనే..



దామోదర, పద్మిని

జోగిపేట(అందోల్): ప్రస్తుత వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పద్మినిలు 1985 జూలై 21వ తేదీన ప్రేమ వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లో చదువుకునే సమయంలోనే వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడి పెళ్లి వరకు వచ్చింది. వీరిద్దరి ప్రేమ వివాహాన్ని ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మారెడ్డి, విమల కూతురు పద్మిని, రాజనర్సింహ, జానాబాయిల కుమారుడు దామోదర. ఈయన సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అప్పట్లో మాజీ మంత్రి రాజనర్సింహ మృతి చెందడంతో దామోదర 1989లో రాజకీయాల్లోకి వచ్చారు. మొదటి సారిగా ఎమ్మెల్యే పోటీ చేసి గెలుపొందారు.

అన్నలు బతికించిన ప్రేమ



మాణిక్యం, తులసిరెడ్డి

మెదక్: ఆర్థిక అసమానతలు, కులవివక్ష, భూస్వామ్యపెత్తనం ఆ ప్రేమను ఆపలేకపోయాయి. ఆ అడ్డుగోడలు వారికి నచ్చలేదు. తమ కుటుంబాలను, సమాజాన్ని నిరసించి ఆ ప్రేమికులు అన్నలను ఆశ్రయించారు. దళంలో చేరారు. వారికి అన్నలే పెళ్లిచేశారు. అలా కలిసి నడిచిన ఆ జంట ఏవే కారణాల వల్ల జనజీవన స్రవంతిలో కలిసింది. పాతికేళ్లుగా వారి కుటుంబాలకు దూరమై ఎన్నో ఆటుపోట్లు ఎదురించి వారు చివరికి ప్రేమను గెలిచారు. అది 1989 సంవత్సరం.. హవేళిఘణాపూర్ మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన తొడంగుల మాణిక్యం(బీసీ), బాగన్నగారి తులసిరెడ్డి(ఓసీ) చిన్నప్పటి నుండి కలిసి చదువుకున్నారు. ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారు. పెళ్లిచేసుకోవాలని నిశ్చయించుకున్నారు. అప్పట్లో గ్రామాల్లో అసమానతలు, కులవివక్ష తీవ్రంగా ఉంది. వారి ప్రేమ వ్యవహారం ఇళ్లలో తెలియడంతో తులసిరెడ్డి ఇంట్లో వ్యతిరేకత మొదలైంది. బీసీ కులానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంటే సమాజంలో మనకున్న పరువు ఏమౌతుంది. ఇక చదువు వద్దని తులసిరెడ్డిపై ఆమె కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చారు. ప్రేమ పెళ్లిచేసుకుంటే ఈ సమాజం తమను తిరస్కరిస్తోందని భావించి వారు అడవిబాట పట్టి అన్నలను కలిశారు. ఆ ప్రేమికులు వారి సమస్యను అన్నలకు వివరించారు.

పోరుబాటే కలిపింది

ఆ ప్రేమికులకు 1990లో అన్నలు పెళ్లిచేశారు. వారి సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తున్న క్రమంలో ఒకసారి తులసిరెడ్డిని పోలీసులు అరెస్టుచేసి జైల్లో పెట్టారు. ప్రాణంగా ప్రేమించిన ఆమెను జైల్లో పెట్టడంతో భరించలేని మాణిక్యం కూడా పోలీసులకు లొంగిపోయాడు. ఆమె బెయిల్‌పై విడుదలయ్యాక ఇద్దరూ పోలీసులకు లొంగిపోయి కాపురం పెట్టారు. పాతిక సంవత్సరాల పాటు తులసిరెడ్డి కుటుంబం, బంధువులు ఎవరూ ఆమెతో మాట్లాడలేదు. తులసిరెడ్డికి వైద్యారోగ్యశాఖలో ఉద్యోగం రావడం, మాణిక్యం రాజకీయాల్లో చేరి రెండు సార్లు పీఏసీఎస్ చైర్మన్‌గా తన స్వగ్రామంలోనే ఎన్నికయ్యారు. నేడు ఆ జంట గ్రామంలోనే కాదు జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది.

జపాన్ టు ఇండియా..



ప్రకాశ్‌రెడ్డి, యూకో

జిన్నారం (పటాన్‌చెరు): వారి ప్రేమ దేశాలు దాటింది. ఏకంగా జపాన్‌కు చెందిన అమ్మాయి ఇండియాకు చెందిన అబ్బాయిని వివాహం చేసుకుంది. పదేళ్ల క్రితం ప్రేమించుకొని ఇద్దరూ తెలుగు సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వారు అమెరికాలో నివాసం ఉంటున్నారు. వారికి ఓ అబ్బాయి ఉన్నాడు.

ప్రేమ ప్రయాణం..

గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన భూపతిరెడ్డి, సావిత్రి దంపతుల రెండో కుమారుడు ప్రకాశ్‌రెడ్డి 2000లో యూకేకి వెళ్లాడు. అక్కడ ఒరాకిల్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. అదే కంపెనీలో జపాన్‌కు చెందిన యూకో అనే యువతి ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో యూకో ఓ సమస్యలో చిక్కుకొంది. ఆ సమయంలో ఆమెకు ప్రకాశ్‌రెడ్డి అండగా నిలబడ్డాడు. సమస్యను పరిష్కరించేందుకు సహకరించాడు. అప్పటి నుంచి వారి మధ్య పరిచయం పెరిగింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. 2003లో పెద్దల అంగీకారంతో వారిద్దరు పెళ్లి చేసుకున్నారు. అప్పట్లో ఈ వివాహం జిల్లాలోనే చర్చినీయాంశమైంది. వారికి జేమ్స్‌రెడ్డి అనే కుమారుడు కూడా ఉన్నాడు. ప్రేమకు కులం, మతం, ప్రాంతం అనే తేడా లేదు అని చెప్పేందుకు ఈ ప్రేమ కథే ఓ ఉదాహరణ.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో అక్రమ మైనింగ్ పై ఉక్కుపాదం మోపాలని, నిబంధనలకు విరుద్ధంగా క్వారీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం కలెక్టర్ క్రాంతితో కలిసి కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్వారీలపై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే విలువైన ప్రభుత్వ భూములు, జల వనరులను కాపాడాలని సూచించారు. జోగిపేట అకోలా జాతీయ రహదారి 161పై చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, అండర్ పాస్ లు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు సూచించారు. ప్రజలకు కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించాలన్నారు. మెడికల్ కళాశాల భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని, సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పీ అశోక్ పాల్గొన్నారు.

డంప్‌యార్డును తరలించాలని వినతి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంప్‌యార్డుతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, దీనిని ఇక్కడి నుంచి తరలించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందించారు. మంత్రి స్పందించి కలెక్టర్‌కు ఫోన్ చేసి డంప్‌యార్డు నిర్మాణ పనులను వెంటనే ఆపాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ రావు, మద్ది వీరారెడ్డి, నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నీలమ్మ ఉన్నారు.

నేడు 'రైల్వే స్టేషన్'కు భూమి పూజ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి శివారులో రైల్వే స్టేషన్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాటి మోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భూమి పూజకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరవుతారన్నారు. గత ప్రభుత్వం మల్లన్న ఆలయ అభివృద్ధిని విస్మరించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

రైల్వే ఎస్పీ సందర్శన

రైల్వే ఎస్పీ కొమురవెల్లిని సందర్శించారు.శివారులో రైల్వేస్టేషన్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ రానున్న నేపథ్యంలో రైల్వే ఎస్పీ అనూప్‌కుమార్ శుక్ల, హుస్నాబాద్ ఏసీపీ సతీష్ కలిసి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పార్కింగ్ స్థలం కోసం పలు సూచనలు చేశారు.



రైళ్ల రాకపోకలకు అంతరాయం

- ఏడు గంటల పాటు నరకయాతన
- వికారాబాద్ వద్ద వాగుపై బ్రిడ్జి పనులు

జహీరాబాద్: వికారాబాద్-మొగంపల్లి రైల్వే స్టేషన్ల మధ్యన గేటు వనంపల్లి వద్ద వాగుపై రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టినందున రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వికారాబాద్-జహీరాబాద్-బీదర్‌ల మధ్య రైళ్ల రాకపోకలు సాగలేదు. మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకే పనులు పూర్తి చేసి రైళ్లకు అంతరాయం కలుగకుండా కార్యాచరణ రూపొందించినప్పటికీ పనులు సాయంత్రం వరకు కొనసాగించాల్సి వచ్చిందని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. దీంతో షిర్డీ-తిరుపతి, నాందేడ్-బెంగుళూరు నడిచే రైళ్లు సదాశివపేట రోడ్ రైల్వే స్టేషన్‌లో నిలిపి ఉంచారు. పూర్ణ-హైదరాబాద్, బెంగుళూరు-నాందేడ్ వెళ్లాల్సిన రైళ్లను వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో నిలిపి ఉంచారు. ఏకంగా ఏడు గంటల పాటు ఆయా రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తాగునీటికి, భోజనాల కోసం నానా తంటలు పడాల్సి వచ్చింది.

ప్రణాళికాబద్ధంగా చదివా..

- కష్టపడితే అసాధ్యమనేది ఉండదు
- జేఈఈ మెయిన్స్ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్ హుండెకర్ విదిత్



జహీరాబాద్ టౌన్: దేశంలో అత్యంత కఠినమైన పరీక్షగా పేరుగాంచిన జేఈఈ మెయిన్స్ సెషన్-1లో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ విద్యార్థి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. మండలంలోని మల్‌చెల్మ గ్రామానికి చెందిన హుండెకర్ అనిల్‌కుమార్ కుమారుడు హుండెకర్ విదిత్ ఓపెన్ క్యాటగిరిలో 300 మార్కులకు 300 సాధించి ఆల్‌ఇండియా టాపర్‌గా నిలిచాడు. విదిత్ తండ్రి అనిల్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, తల్లి మమత ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు. 1వ తరగతి నంచి 7వ తరగతి వరకు జహీరాబాద్‌లో.. 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని నారాయణ విద్యాసంస్థల్లో చదివాడు. జేఈఈ పరీక్ష కోసం ప్రతి రోజు 15 గంటల పాటు.. అది కూడా ప్రణాళికాబద్దంగా చదివినట్లు విదిత్ తెలిపాడు. సమయం వృథా చేయడం తనకు ఇష్టం ఉండదని, ప్రిపరేషన్.. ఫోకస్ అంతా జేఈఈ మెయిన్స్‌పైనే పెట్టానని పేర్కొన్నాడు. ఒత్తిడి లేకుండా చదడం అలవాటు చేసుకున్నానని, తమ తల్లిదండ్రులు సలహాలిచ్చేవారని చెప్పారు. ప్రతి సబ్జెక్టునూ ప్రణాళిక ప్రకారం చదివానన్నాడు. ''కళాశాలలో టెస్టులు పెట్టిన ప్రతిసారి టాపర్‌గా ఉండేవాడి.. దీంతో పరీక్షల సమయంలో కాన్ఫిడెంట్‌గా ఉన్న. జేఈఈ మెయిన్స్‌లో అన్ని ప్రశ్నలకు ఆన్సర్ చేశా. 300 మర్కులకు 300 మార్కులతో ఆల్‌ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించా'' అని విదిత్ సంతోషం వ్యక్తం చేశాడు. జేఈఈ మెయిన్స్‌లో 23 మందికి ఫస్ట్ ర్యాంక్ రాగా 13 మందికి వందకు వంద మార్కులు వచ్చాయి. అందులో తాను కూడా ఉన్నాన్నాడు.నమ్మకం.. కష్టపడేతత్వం ఉంటే అసాధ్యమనేది ఉండదన్నాడు. ఇంటర్‌లో జాయిన్ అయిన దగ్గర నుంచి ప్రామాణిక పుస్తకాలను చదవడం తప్పనిసరి. మంచి పుస్తకాలు ఒకటికి రెండు సార్లు చదవడం మేలని విదిత్ పేర్కొన్నారు. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన హెండెకర్ విదిత్‌ను జహీరాబాద్ వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.నాగేశ్వర్‌రావు, విజయ్ కుమార్ శెట్టిలు అభినందలు తెలిపారు.

పృథ్వీరాజ్‌కు 99.08 శాతం

జోగిపేట(అందోల్): పట్టణానికి చెందిన అల్లె పృథ్వీరాజ్ జేఈఈ ఎంట్రెన్స్ టెస్టులో 99.08 శాతం పర్సంటైల్ సాధించాడు. అల్లె మహవీర్, స్వర్ణలత దంపతుల కుమారుడైన పృథ్వీరాజ్ హైదరాబాద్‌లోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఐఐటీలో సీటు సాధించాలన్నదే తన లక్ష్యమని పృథ్వీరాజ్ తెలిపాడు.

మెట్రోను సంగారెడ్డి వరకు పొడిగించాలి

- మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- కలెక్టరేట్ వద్ద బీజేపీ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి : మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని ప్రజలే తిరస్కరించారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మెట్రోరైల్‌ను సంగారెడ్డి వరకు పొడిగించాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘునందన్ పాల్గొని మాట్లాడారు. మెట్రో పొడిగింపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు స్పందించాలని అన్నారు. లేదంటే ఉద్యమం చేసైనా మెట్రో రైల్ సాధిస్తామన్నారు. గోదావరి మాట్లాడుతూ.. మెట్రో ట్రైన్ కోసం గతంలో కూడా బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు చేశామన్నారు. అలాగే ఈ విషయంపై జగ్గారెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి విన్నవించారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున జగ్గారెడ్డి ఆ పార్టీ నాయకులను ఒప్పించి సంగారెడ్డి వరకు మెట్రో రైలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయకుమార్, సంగప్ప, పులిమామిడి రాజు, రాజశేఖర్‌రెడ్డి, కులకర్ణి, మాణిక్ రావు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి : వైద్య వృత్తి ఉన్నతమైనదని, విద్యార్థులు కష్టపడి చదివి నైపుణ్యం గల డాక్టర్లుగా ఎదగాలని కలెక్టర్ క్రాంతి ఉద్బోధించారు. మంగళవారం ఆమె సంగారెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతిని, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించి పరిశీలించారు. మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మెడికల్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని వార్డులను, ఆపరేషన్ థియేటర్లను, ఓపీ, డయాలసిస్ సెంటర్, ఎంసి హెచ్, స్కానింగ్, రేడియాలజీ, ల్యాబ్స్, తదితర విభాగాలన్నింటినీ తిరిగి చూశారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్లో నమోదైన పేషెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి ఇంకా ఏమైనా పరికరాలు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూపరింటెండెంట్ అనిల్‌కు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, అధికారులు ఉన్నారు.



మెడికల్ కళాశాల నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సంగారెడ్డి టౌన్ : ఎక్కడికి వెళ్లినా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పలు శాఖల అధికారులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఆరు గృహాల్లో చోరీలు
- గౌరయపల్లిలో దొంగల బీభత్సం



వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం



పగులగొట్టిన తాళం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గౌరయపల్లిలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీల కనకయ్య ఇంట్లో 10 తులాల బంగారం, బొచ్చు లక్ష్మీ గృహంలో తులం బంగారం, ఆరు తులాల వెండితోపాటు రూ.21 వేలు నగదు, నరెడ్ల మల్లవ్వ ఇంటిలో రూ.20 వేల నగదు, సన్నపురి రాములమ్మ ఇంట్లో 20 తులాల వెండి పట్టాగొలుసులు, 6 వేల నగదు, దొంతరబోయిన భిక్షపతి ఇంట్లో రూ. 2లక్షల 80వేలు, బండి మల్లవ్వ గృహంలో 25 తులాల వెండి, తులం బంగారం, 4 వేల నగదును చోరీ చేశారు. సమాచారం తెలుసుకున్న చేర్యాల సీఐ శ్రీనివాస్, ఎస్ నాగరాజు చోరీలు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. క్లూస్ టీం.. వేలి ముద్రలను సేకరించింది. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఆ ఇంట్లో రెండోసారి..

నీల కనకయ్య ఇంట్లో 10 నెలల క్రితం చోరీ జరుగగా కేసు దర్యాప్తు ఉంది.. మంగళవారం మరోసారి దొంగతనం జరగడంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

వ్యాపారి ఆస్తుల వేలంపాట



వ్యాపారి ఆస్తులను వేలం వేస్తున్న అధికారులు

నర్సాపూర్: సీఎంఆర్ బకాయిల వసూలులో భాగంగా మంగళవారం ఓ వ్యాపారికి చెందిన పలు ఆస్తులను వేలం వేశామని తహసీల్దార్ కమలాద్రి తెలిపారు. నర్సాపూర్‌కు చెందిన వ్యాపారి శ్రీధర్‌గుప్తా ప్రభుత్వానికి 47 కోట్ల 17 లక్షల 3 వేల 80 రూపాయలను బకాయి పడ్డారన్నారు. రికవరీలో భాగంగా ముందుగా నిర్ణయించిన మేరకు తమ కార్యాలయ ఆవరణలో వేలం వేశాన్నారు. టీవీ వేలంగా వేయగా 19, 500 రూపాయలు, రెండు ఏసీలు వేలంగా వేయగా 37 వేల రూపాయలు వచ్చాయని చెప్పారు. కారును వేలం వేయగా రూ.7 లక్షల 95 వేలు వచ్చాయని, ఇంకో కారును వేలం వేయగా 14 లక్షల 45 వేల రూపాయలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. అన్నింటినీ సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఊట్ల గ్రామానికి చెందిన సిద్దుల ప్రవీణ్ కొనుగోలు చేశారన్నారు. ఆయన వెంట ఆర్ఐలు ఫైజల్, సిద్దిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గాజిరెడ్డిపల్లి శివారులో ఘటన

హవేళిఘణాపూర్(మెదక్): ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండలపరిధిలోని గాజిరెడ్డిపల్లి శివారులో ఎల్లమ్మ దేవాలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(30) మంగళవారం హవేళిఘణాపూర్‌లో అంగడికి వెళ్లి తిరిగొస్తున్నాడు. మెదక్‌కు ఆటో వెళ్తోంది. గాజిరెడ్డి సమీపంలో రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రాజుకు తీవ్రగాయాలై మృతి చెందాడు. సమాచారం అందుకున్న హవేళిఘణాపూర్ పోలీసులు ఇక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానరాని సమన్వయం

- ప్రత్యేకాధికారులు, కార్యదర్శుల మధ్య 'పంచాయితీ'
- ముందుకు సాగని ప్రగతి పనులు



గాంధీనగర్‌లో నర్సరీ పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సరోజ

హుస్నాబాద్ రూరల్: పల్లెల అభివృద్ధి ఎక్కడ కూడా కుంటు పడకూడదని సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగానే వెంటనే ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. జిల్లాలో 499 గ్రామ పంచాయతీల్లో ఈనెల 1న గెజిటెడ్ ఉద్యోగులకే పాలన బాధ్యతలు అప్పజెప్పారు. పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకే గ్రామ పరిపాలన, ప్రజలతో మమేకమై విధులు నిర్వహించే అనుభవం ఉంది. కానీ మిగతా శాఖల వారు క్షేత్రస్థాయిలో ఈ బాధ్యతలు నిర్వర్తించలేదని తెలుస్తోంది. తమ హోదాలో గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంది. ఎప్పటి లాగే ఎవరికి వారు తమ మాతృశాఖ ఉద్యోగ విధులు నిర్వర్తించాలి. రెండు బాధ్యతలతో అధికంగా శ్రమించాల్సి వస్తోంది. దీంతో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక అధికారులకు మధ్య సమన్వయం లేకపోవడంతో ఇద్దరి ×పంచాయితీ×లు మండల పరిషత్ కార్యాలయాలకు చేరుతున్నాయి. అభివృద్ధి పనుల నిమిత్తం కొనే వస్తు సామగ్రి ఖర్చులతో తమకు ఏం సంబంధం లేదన్నట్లుగా ప్రత్యేకాధికారులు వ్యవహరిస్తుండటంతో కార్యదర్శులు ఏమీ చేయలేని స్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో రాజకీయ నాయకులతో కలిసి వారు ఒత్తిడి తేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులను సర్పంచ్‌లు.. ముందుండి చేయించి తర్వాత బిల్లులు తీసుకునేవారు. ఇప్పుడు ఆ స్థానంలో నియమించబడ్డ వీరు ముందు పెట్టుబడి పెట్టి పనులు చేయించలేరు. కార్యదర్శులు పనులు చేయిస్తే బిల్లుల చెల్లింపుకు అడ్డుపడితే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు, పంచాయతీ కార్మికులకు కావాల్సిన పనిముట్ల విషయమై గతంలో సర్పంచ్‌లు చెబితే కార్యదర్శులు కొనేది. తర్వాత బిల్లులు ఇప్పించేవారు. ఇప్పుడు ఇద్దరు ప్రభుత్వ అధికారులు ఉన్నారు. పరిపాలన పై పట్టులేకపోవడం వలన అభివృద్ధి పనుల నిర్ణయాలు ముందుకు సాగడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

వారి విధులివే..

ప్రత్యేకాధిరులు.. రోజూ గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలి. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలి. అభివృద్ధి పనులు చేయించాలి. సర్పంచ్‌లు చేసే పనులన్నీ చేయిస్తూనే పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకోవాలి. ఉపాధి కూలీలకు పని కల్పించాలి పనులు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించాలి. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా ప్రణాళికలను రూపొందించుకోవాలి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తున్నారా లేదా పర్యవేక్షణ చేయాలి.



పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పైపు లైన్ వేయలేదు



మా ఊరులో మిషన్ భగీరథ పైపు లైన్ వేసి బిల్లులు తీసుకున్నారు. దాని ద్వారా ఒక రోజు ఒక ఇంటికి కూడా నీరు సరఫరా కాలేదు. ఈ విషయమై నాలుగేళ్ల మండల సమావేశాల్లో మొత్తుకున్నా పరిష్కారం కాలేదు. ఈలోపు మా పదవీ కాలం పూర్తయి ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. ఇప్పుడి పనులు చేస్తారో? లేదో? వేచిచూడాలి. అధికారులు సమయానికి వచ్చి వెళ్తారు.. మేమైతే ఏ సమయంలోనైనా ప్రజలకు అందుబాటులో ఉన్నాం. అప్పులు తెచ్చి మరి అభివృద్ధి పనులను చేయిచాం. వారు ఇలా చేయగలరా?

– సాయిలు, పోతారం(ఎస్) మాజీ సర్పంచ్

వసంత పంచమికి సిద్ధం

వసంత పంచమి వేడుకల కోసం సరస్వతీ మాత ఆలయం సిద్ధమైంది. అక్షరభ్యాసాలు, విశేష పూజల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులు భారీగా తరలిరానున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇక్కడ అక్షరాభ్యాసం చేయిస్తే చిన్నారులు ప్రతిభావంతులవుతారని భక్తుల విశ్వాసం. అయితే రాష్ట్రంలోనే వర్గల్ క్షేత్రం రెండో బాసరగా విరాజిల్లుతోంది.

- ముస్తాబైన వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రం
- విశేష పూజలు, అక్షరాభ్యాసాలకు ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తజనం



కొలువైన సరస్వతీ అమ్మవారు

వర్గల్(గజ్వేల్): చిన్నారులకు జ్ఞానం ప్రసాదించే అక్షరాభ్యాస కేంద్రం.. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత క్షేత్రం. తెలంగాణలో రెండో బాసరగా విలసిల్లుతున్న సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రం బుధవారం వసంత పంచమి మహోత్సవానికి ముస్తాబైంది. స్వయంభూగా మహదేవుడు వెలసిన వర్గల్ శంభునికొండపై సప్తస్వరాల గుండు చెంత ఈ ఆలయం కొలువుదీరింది. 1989 వసంత పంచమి రోజున ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు అంకురార్పణ జరగగా, 1992లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కొండపైన మెట్ల మార్గంలో ఆకట్టుకునేలా 14 అడుగుల ఎత్తయిన వీణాపాణి విగ్రహం ఉన్నది. 1999లో వేదపాఠశాల ప్రారంభం కాగా, ఇటీవలే రూ. 4 కోట్లతో కంచి శంకరమఠం, వేద పాఠశాల భవనం రూపుదిద్దుకుంది. 2001లో అన్నదాన సత్రం ప్రారంభించగా ఏటా 10 లక్షల మందికి అన్నదానం జరుగుతుంది.

క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు

చిన్నారుల అక్షర స్వీకారాలకు, ఉత్సవ వేడుకలకు వచ్చే భక్తులకు సౌకర్యంగా కొండ దిగువ నుంచి ప్రత్యేక క్యూ లైన్లు, బారికేడ్లు, చలవ పందిళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి విడత (గంటకు) 600 అక్షరాభ్యాసాలు జరిగేలా మూడంతస్తుల మహామండపం, అన్నదాన మండపం, వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాలను సిద్ధం చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రతి గంటకు ఒక బ్యాచ్ చొప్పున అక్షరాభ్యాసాలు జరుగుతాయి. తెల్లవారుజాము 4 గంటలకు అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, ఉదయం 6 గంటలకు చండీ హోమం, 7 గంటలకు పల్లకీ సేవ, గిరి ప్రదక్షిణం, 9 గంటలకు సామూహిక లక్ష పుష్పార్చన, 11.30 గంటలకు చప్పన్ భోగ్ (56 రకాల మధుర పదార్థాలు) నివేదన, విద్యాజ్యోతి దర్శనం, రాత్రి 7 గంటలకు ప్రదోషకాల శ్రీచక్ర పూజ నిర్వహించనున్నారు. కాగా, భాగ్యనగరానికి 50 కిలోమీటర్ల దూరంలోని వర్గల్ క్షేత్రానికి పర్వదినం సందర్భంగా సికింద్రాబాద్ గురుద్వార్ నుంచి రోజంతా ఆర్టీసీ బస్సులు నడుస్తాయని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి తెలిపారు. పీఠాధిపతులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

అత్తారింటికి వచ్చి.. చెప్పకుండా వెళ్లి..

తల్లితో సహా ఇద్దరు పిల్లలు అదృశ్యం



హరిత, ఇద్దరు పిల్లలు

పటాన్‌చెరు టౌన్: ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైంది. ఈ సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... రంగారెడ్డి జిల్లా కొండాపూర్ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఈశ్వరమ్మ కూతురు హరితకు బీరంగూడకు చెందిన మిథున్‌బాబుతో వివాహమైంది. భార్యాభర్తలిద్దరూ తమ పిల్లలతో కలిసి జగద్గిరిగుట్ట ఎల్లమ్మ బండ వద్ద నివాసం ఉంటున్నారు. అతను ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జనవరి 1న భార్యతో గొడవ పడి అతను తన కుటుంబాన్ని వదిలేసి, బీరంగూడలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఈనెల 12న హరిత తన ఇద్దరు పిల్లలు ధనుషిక(2) తియాన్(6)లను తీసుకొని అత్తారింటికే వచ్చింది. తిరిగి 13వ తేదీ ఉదయం ఇక్కడి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. వీరి కోసం తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

భార్య మిస్సింగ్‌పై...



మానస

భార్య అదృశ్యమైందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన బీడీఎల్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారానికి చెందిన చాకలి రాజు భార్య మానస(26) జనవరి 9న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆమె కోసం భర్త తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలోనూ.. ఇలాగే వెళ్లి పోయి తిరిగొచ్చిందని పోలీసులకు తెలిపాడు. రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

అంత్యక్రియల్లో పాల్గొనేందుకొచ్చి అనంతలోకాలకు

స్నానానికి వెళ్లి చెరువులో పడి యువకుడి మృతి




కరుణాకర్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): అంత్యక్రియల్లో పాల్గొని చెరువులో స్నానానికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్ మండలం కొండాపూర్‌లో చోటుచేసుకుంది. మంగళవారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సందగళ్ల వెంకటయ్య చిన్నకుమారుడు కరుణాకర్(25) ఇదే గ్రామంలో జల్లి సత్యనారాయణ గుండెపోటుతో మృతిచెందితే అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం స్నానం కోసం బతుకమ్మ ఘాట్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు గాలించి బయటికి తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించే లోపు మృతిచెందాడు.

సైబర్ కేటుగాళ్ల మోసం

పలువురి నుంచి రూ.1.45 లక్షలు కాజేశారు



సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్ల బారిన పడి పలువురు నగదును పోగొట్టుకున్నారు. ఈ సంఘటనలు సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. సీపీ అనురాధ కథనం ప్రకారం.. టూటౌన్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంకు లోన్ మంజూరైందని ఒక ఫైనాన్స్ కంపెనీకి చెందిన లింకు పంపాడు. ఖాతాలో నగదు జమ కావాలంటే ముందుగా చార్జీలు చెల్లించాలన్నాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు లింకును ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో రూ. 63,350 పంపాడు. తర్వాత ఆ నంబర్‌కు కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో వెంటనే బాధితుడు 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.17వేలను ఫ్రీజ్ చేశారు.

- వన్ టౌన్ స్టేషన్ పరిధిలోని ఓ ఫర్నిచర్ షాపు నిర్వాహకుడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఆర్మీలో పని చేస్తున్నానని తక్కువ ధరకే క్వాలిటీ పరుపులు పంపిస్తానన్నాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తనతో మాట్లాడిన వ్యక్తి పంపిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కొంత మొత్తం డబ్బులు పంపాడు. ఇలా కోడ్ స్కాన్ చేసి నగదు పంపించే క్రమంలో ఖాతా నుంచి రూ.51,997 డెబిట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.
- గజ్వేల్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఉద్యోగం పేరుతో లింకు పంపాడు. బాధితుడు దాన్ని ఓపెన్ చేసి వివరాలు నమోదు చేస్తే వెంటనే బాధితుడి ఖాతా నుంచి రూ.30,600 డెబిట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. దీంతో అతను వెంటనే పై నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

రచన మృతిపై అనుమానాల్లేవు

మృతురాలి తల్లిదండ్రులు

పటాన్‌చెరు టౌన్: పీజీ వైద్య విద్యార్థి రచనారెడ్డి మృతిపై మాకు ఎలాంటి అనుమానమూ లేదని ఆమె తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఒత్తిడి, డిప్రెషన్‌తోనే ఆత్మహత్య చేసుకొని ఉంటుందన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మండలం కృష్ణారెడ్డిపేట ఓఆర్ఆర్‌పై అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందడం తెలిసిందే. మంగళవారం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న తన మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వచ్చిన కుటుంబసభ్యులు మీడియాతో మాట్లాడారు. పని ఒత్తిడి, డిప్రెషన్‌తోనే ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చన్నారు. అందరితో మంచిగా ఉండేదని, ఎటువంటి ఇబ్బందులూ లేవన్నారు. ఆమె పెళ్లి విషయమై... ఆత్మహత్యకు పాల్పడిందని వినిపిస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తిస్థాయి వివరాలు చెబుతామని పోలీసులు తెలిపారు.



రచనారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పథకాల అమలు భేష్

సిద్దిపేటరూరల్: ప్రభుత్వాల పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసుకోవడం ఎంతో ఆదర్శనీయమని కేంద్ర ప్రభుత్వ సెక్షన్ ఆఫీసర్లు తెలిపారు. మంగళవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న కేంద్ర ప్రభుత్వ సెక్టోరియల్ లెవల్–డికి చెందిన 15 మంది అధికారుల జిల్లా పర్యటన ముగిసింది. ఈ మేరకు కలెక్టర్‌తో వారు సమావేశమయ్యారు. ఈనెల 6 నుంచి 13 వరకు జిల్లాలో పర్యటించి ఉపాధి పథకం, పీఎం పోషణ అభియాన్ తదితర పథకాల అమలు, ప్రతి ఇంటికీ తాగునీరు తదితరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



కలెక్టర్‌తో కేంద్ర ప్రభుత్వ శిక్షణ అధికారులు

ఆరోగ్యం కుదుట పడటం లేదని..

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



బుజ్జమ్మ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): ఆరోగ్యం కుదుట పడటం లేదని జీవితంపై విరక్తి చెంది మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రాయపోలు మండలం మంతూరులో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల బుజ్జమ్మ (45) కొంతకాలంగా మూర్ఛతో బాధపడుతుంది. పలు హాస్పిటల్స్‌లో చికిత్స తీసుకున్నా తగ్గలేదు. సోమవారం ఆమె ఒక్కర్తే ఇంట్లో ఒంటరిగా ఉంది.. భర్త రాములు పొలం వెళ్లాడు. చిన్నకూతురు స్రవంతి సైతం ఉదయం 9 గంటలకే కూలీ పనికెళ్లి సాయంత్రం 6 గంటల తర్వాత తిరిగి వస్తుంది. అలా బయటి నుంచి లోపలికి వెళ్లే సరికి బుజ్జమ్మ దూలానికి చీరతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారికి తెలపగా వారొచ్చి కిందికి దింపేసరికే మృతిచెందింది. భార్య అనారోగ్యంతో బాధపడుతోందని ఈ నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడిందని భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఇంటిగ్రేటెడ్ కార్యాలయమేదీ?

సర్కారు కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరిన పాఠశాలలో, రేకుల షెడ్డులో సరైన సదుపాయాలు లేకపోయినా సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. వేసవి వస్తే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇక ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని అధికారులు భావించినా గానీ ఆచరణకు నోచుకోలేదు.

- ఎనిమిదేళ్లుగా ఎదురుచూపే
- అద్దె భవనాల్లోనే సర్కారు కార్యాలయాలు
- అరకొర సదుపాయాలతోనే కొనసాగింపు
- సిబ్బందికి తప్పని ఇబ్బంది
- ఇదీ రాయపోలు మండలంలోని దుస్థితి



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో కొనసాగుతున్న రెవెన్యూ ఆఫీస్

రాయపోలు(దుబ్బాక): ఐదు దశాబ్దాలుగా రాయపోలు మండలం ఏర్పాటు కోసం పోరాడితే 2016 అక్టోబర్ 12న కల సాకారమైంది. దౌల్తాబాద్ మండలం నుంచి విడిపోయి 13 పంచాయతీలతో కొత్త మండలంగా ఊపిరి పోసుకుంది. 2019లో పంచాయతీ పునర్విభజన జరిగిన తర్వాత మండలపరిధిలో 19 పంచాయతీలున్నాయి.

ఠాణాకూ ఏదీ ఠికాణా..

మండలంలో శాంతి భద్రతలు పరిరక్షించే పోలీసు స్టేషన్ సైతం ఓ ప్రైవేటు ఇంటిలో కొనసాగుతోంది. నాలుగు గదుల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. కనీసం లాకప్ ఏర్పాటు చేసుకోలేకపోవడం.. ఆయుధాలు దాచుకునేందుకు కూడా గది లేకపోవడంతో సతమతమవుతున్నారు. అలాగే సెర్ప్ కార్యాలయం కూడా వదిలేసిన పాఠశాల భవనంలోనే కొనసాగుతోంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట నిర్మించి ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వ అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ఎలాగైనా వారు చర్యలు తీసుకుని ఒకేచోట ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏది పాలనా సౌలభ్యం..

పాలనా సౌలభ్యం కోసం చిన్న మండలాలు, చిన్న జిల్లాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాయపోలు మండలంగా ఏర్పడినప్పటికీ ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగ్గపోవడంతో ప్రజలకు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలం ఏర్పడి ఎనిమిదేళ్లవుతున్నా.. నేటికీ ఒక్క సొంత భవనం కూడా నిర్మాణానికి నోచలేదు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా మరమ్మతు చేసుకుని తహసీల్దార్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడే మండల స్థాయి రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం కూడా కొనసాగుతుండటంతో గదులు చాలక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

రేకుల షెడ్డులో..

మండల పరిషత్ కార్యాలయానికి కూడా సొంత భవనం లేదు. అరకొర మౌలిక సదుపాయాలతోనే సర్దుకుంటూ ఓ ప్రైవేటు రేకుల షెడ్డులో కార్యాలయాన్ని కొనసాగుతోంది. టాయిలెట్లు కూడా సరిగా లేక ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయం పనుల నిమిత్తం వచ్చే మహిళా పంచాయతీ కార్యదర్శులు బాధలు చెప్పలేక పోతున్నారు. ఇక వేసవి వస్తే షెడ్డులో విధులు నిర్వహించడం చాలా కష్టంగా మారుతోందని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.



రేకుల షెడ్డులో ఎంపీపీ కార్యాలయం